క్లుప్తంగా

ప్రచారంలో దూసుకుపోతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



30వ వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం

మహారాణిపేట : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గాలి వీస్తోందని, రానున్న ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుంటుందని 30వ వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం అన్నారు. ఆదివారం వార్డు పరిధి అఫీషియల్ కాలనీలో ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించాలని కోరారు. నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, దశమంతుల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించిన హార్బర్ ఏసీపీ



సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏసీపీ మోసెస్‌పాల్

దాబాగార్డెన్స్ : ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టేందుకు పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పలు సమస్యాత్మక ప్రాంతాల్లో హార్బర్ ఏసీపీ మోసెస్‌పాల్ ఆదివారం పర్యటించారు. రౌడీ మూకలను హెచ్చరించారు. రాత్రి వేళల్లో మద్యం సీసాలతో హల్‌చల్ చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఆకతాయిలకు అడ్డుకట్ట వేసేందుకు సోమవారం నుంచి జాలరిపేటలో 6 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు మోసెస్‌పాల్ తెలిపారు.

వృద్ధురాలికి వైద్య సేవలు



వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

దాబాగార్డెన్స్ : స్వామి వివేకానంద ఆశ్రమంలో పదేళ్లుగా ఆశ్రయం పొందుతున్న ఒక వృద్ధురాలు ఆదివారం ఉదయం ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోయింది. పరిస్థితి బాగులేక పోవడంతో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు 108కి ఫోన్ చేశారు. వెంటనే 108 సిబ్బంది వచ్చి ఆ వృద్ధురాలికి సపర్యలు చేశారు. అనంతరం ఏఎస్ బీచ్ ఆస్పత్రి డాక్టర్ సీఎంపి జహీర్ అహ్మద్ వచ్చి ఆ వృద్ధురాలికి చికిత్స అందజేయడంతో ఆమె కోలుకుంది.

ఘనంగా నూకాలమ్మ తొలేళ్ల పండగ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో కొలువుదీరిన శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం తొలేళ్ల సంబరంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు, గాజులు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు డి.వెంకటాచార్యులు భక్తుల గోత్ర నామాలతో అర్చన చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

మీలో ఒక్కడిని.. మీ సేవకుడిని



పూర్ణామార్కెట్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లిని సత్కరించి, హారతి ఇస్తున్న మహిళా వ్యాపారులు



గజమాల వేసి వాసుపల్లిని ఆహ్వానిస్తున్న పూర్ణామార్కెట్ వ్యాపారులు



ఇంటింటి ప్రచారంలో వరుదు కల్యాణి

- 35వ వార్డు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి
- పూర్ణామార్కెట్ వ్యాపారులతో మమేకమై మాటామంతీ
- హారతులు పట్టి స్వాగతం పలికిన మహిళా వ్యాపారులు

జగదాంబ : నిరంతరం అందుబాటులో ఉంటూ.. దక్షిణ ప్రజలకు సేవ చేస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. ఆదివారం జీవీఎంసీ 35వ వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లిని వ్యాపారులు భారీ గజమాలతో సత్కరించారు. ప్రచారంలో భాగంగా వాసుపల్లి వ్యాపారులతో **కలిసి మార్కెట్** అంతా కలియదిరిగారు. కోళ్ల వ్యాపారి **వద్ద నాటు** కోడి కొనుగోలు చేశారు. మత్స్యకార **మహిళతో** కలిసి చేపలు విక్రయించారు. **కూరగాయల అమ్మ**కాలు చేపట్టారు. ఫ్రూట్‌మార్కెట్‌లో పళ్లు విక్రయించి వ్యాపారులను ఓటు అభ్యర్థించారు. దీంతో వ్యాపారులంతా వాసుపల్లికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగన్‌ను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. తనను నమ్మిన ప్రజలకు ఎప్పుడూ సేవ చేస్తూనే ఉంటానన్నారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అట్టడుగు ప్రజలు, మత్స్యకారులకు చంద్రబాబు అన్యాయం చేశారన్నారు. జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందన్నారు. మరో 20 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, వ్యాపారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

32, 33 వార్డుల్లో..

అల్లిపురం : అల్లిపురం మార్కెట్ అన్నా, మార్కెట్‌లోని వ్యాపారులన్నా తనకెంతో అభిమానం అని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 32వ వార్డు నాయకుడు మూలే రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక మహాత్మాగాంధీ కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో అధికారంలో ఉన్నప్పటికీ మార్కెట్ కోసం ధర్నాలు చేసి జీవీఎంసీ, పోలీసులతో పోరాడానని తెలిపారు. చంద్రబాబు వ్యాపారుల పొట్ట కొట్టి వాళ్ల ఉసురు పోసుకున్నాడన్నారు. ఆ పార్టీలో ఇమడలేక జన హృదయ నేత జగనన్న పార్టీలో చేరానని స్పష్టం చేశారు. మార్కెట్‌లో ఉల్లిపాయలు అమ్మి కార్యకర్తలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పచ్చిరిపల్లి రాము, దేవా, కృష్ణవేణి, రమేష్, వాసుపల్లి బంగారమ్మ, శ్రీనివాస్, గోవింద్, చందు, అశోక్, కోటి, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రచారం..

శాసన మండలి సభ్యురాలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ప్రభుత్వ విప్ వరుదు కల్యాణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతితో కలిసి ఆదివారం 33వ వార్డులో మహిళలకు మెహందీ పెడుతూ ప్రచారం చేశారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే విశాఖ పరిపాలనా రాజధాని అవుతుందన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోదిల పాటి ఉమ, కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, నీలాపు రమణారెడ్డి, పాల శ్రీహరిరెడ్డి, చిన్నమ్మలు, ఊర్వశి, శివ, వెంకటేశ్వరమెట్ట గుడి చైర్మన్ బొడ్డేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దండుబజార్‌లో..

దాబాగార్డెన్స్ : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం 29వ వార్డు దండుబజార్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. అక్కడి మత్స్యకారులు, మటన్, చికెన్, కూరగాయల వర్తకులను ఆప్యాయంగా పలకరించి ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. టిఫిన్ దుకాణం వద్ద మైసూర్ బోండాలు వేశారు. గణేష్‌కుమార్‌కి వ్యాపారులు మద్దతు ప్రకటించారు. మండల అధ్యక్షుడు పీతల వాసు, వార్డు నాయకులు నీలాపు లక్ష్మి, కోరాడ సురేష్, బెవర మహేష్, అడపా శివ, ఆరుగుల రాజు, తమ్మినేని శ్రీనివాస్, నేపాల్ రాజు, సంతోష్, కనకల రాజు, ఆకుల శ్యామ్‌కుమార్, జయంతి, వడ్డాది శివ, నమ్మి భరత్, శ్రీను, పడాల సూర్యకుమార్, చలమరెడ్డి చిన్నారావు పాల్గొన్నారు.



ఫిష్ మార్కెట్‌లో చేపలమ్ముతూ..



ఫ్రూట్‌మార్కెట్‌లో వాసుపల్లికి సంఘీభావం తెలుపుతున్న వ్యాపారులు



దండుబజార్‌లో ప్రచారం చేస్తున్న వాసుపల్లి



అల్లిపురం మార్కెట్‌లో ఉల్లిపాయలు విక్రయిస్తున్న వాసుపల్లి



పూర్ణామార్కెట్‌లో వ్యాపారి వద్ద నాటుకోడి కొనుగోలు చేస్తున్న వాసుపల్లి

సీతారాముల పరిణయానికి ఏర్పాట్లు

- అంబికాబాగ్‌కు కల్యాణకాంతులు
- సీతారామచంద్రాలయంలో నవమి వేడుకలు
- 18 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు



చంద్రమణీదేవి పూజించిన విగ్రహాలు



సీతారామచంద్రస్వామి



రెండో భద్రాద్రిగా పేరొందిన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం

దాబాగార్డెన్స్ : లోకాభిరాముడు శ్రీరాముడు జనకసుత జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణ చేపట్టారు.

కార్యక్రమాలివీ..

ఈ నెల 9 నుంచి 18 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్యాణరాట, పెండ్లి కుమారుని చేయుట, పంచాంగ శ్రవణం జరపనున్నారు. 10 నుంచి 18 వరకు ప్రతి రోజూ ఉదయం స్వామికి విశేష ఆరాధన, సహస్రనామార్చన, సాయంత్రం వేళల్లో విశేష ఆరాధన, హారతులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు స్వామి కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 18న శ్రీరామ పట్టాభిషేకం జరపనున్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891-2528645, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

వైభవంగా వేడుకలు నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 18 వరకు సీతారామ కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ మేరకు అంబికాబాగ్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. 9న కల్యాణ రాట, పెండ్లి కుమారుని చేయడం, అనంతరం పంచాంగ శ్రవణం (ఉగాది) ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 10 నుంచి 16 వరకు స్వామికి ప్రత్యేకాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 17న శ్రీరామనవమి సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించనున్నామని, 18న స్వామి పట్టాభిషేకం జరుగుతుందని తెలిపారు. శ్రీరామనవమి కల్యాణ మహోత్సవంలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చని చెప్పారు. అనంతరం 5 వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఆలయ ఏఈవో కేఎస్ తిరుమలేశ్వరరావు, వి.రాంబాబు, ఆలయ ప్రధాన అర్చకుడు బాలు తదితరులు పాల్గొన్నారు.

బొత్స ఝాన్సీ, వాసుపల్లి గెలుపునకు కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాతున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో జేసీఎస్ మండల కన్వీనర్ కోడిగుడ్ల శ్రీధర్ ఆదివారం పద్మశాలి నాయకులు, యువతతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గణేష్‌కుమార్‌ను గెలిపించుకోవాలని శ్రీధర్ కోరారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో పద్మశాలీలు, చేనేత కార్మికులకు 50 ఏళ్లకే పెన్షన్ పథకం అమల్లోకి తీసుకొచ్చారన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన పద్మశాలి యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గిడుతూరి జాన్, ఆంథోనీ, మదాబత్తుల సెబాస్టియన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకుడు చక్రవర్తి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామవళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

దేశ సంపదను అమ్మే హక్కు కేంద్రానికి లేదు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరిగిందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1151వ రోజుకు చేరుకున్నాయి. పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, సీఐటీయూ కార్మికులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగుతుందని ప్రధాని నరేంద్రమోది స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. దేశ సంపదను సృష్టించలేని కేంద్ర ప్రభుత్వానికి అమ్మే హక్కు మాత్రం ఎవరిచ్చారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని, స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, గాజువాక సీపీఎం అసెంబ్లీ అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, ఇతర పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి ఆశ్రయం



భాస్కరరావుకు ఐడీ కార్డు అందజేస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : కరోనాలో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలను పోగొట్టుకున్న కూర్మన్నపాలేనికి చెందిన భాస్కరరావు అనాథలా మిగిలిలాడు. ఆస్పత్రి బిల్లు కోసం తనకున్న 107 గజాలు ఇంటి స్థలాన్ని ఆస్పత్రి వారికి రాసిచ్చాడు. తుదకు నిలువ నీడ లేకుండా రోడ్డున పడ్డాడు. దీంతో అతనిని జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు చేరదీసి ఆశ్రయం కల్పించారు. అతనికి ఓటరు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించి షెల్టర్‌లో డ్రైవర్‌గా పనికి చేర్చుకుని ఉపాధి కల్పించారు.

కేజ్రీవాల్ విడుదల కోరుతూ ఉపవాస దీక్ష

సీతమ్మధార : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలని దేశమంతటా చేస్తున్న ఉపవాస దీక్షల్లో భాగంగా ఆదివారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆ పార్టీ విశాఖ నాయకులు ఉపవాస కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, భారత్ బచావ్, ఇతర ప్రజా సంఘాల సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలతో దేశాన్ని అంధకారంలోకి నెట్టేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజ్, సీపీఎం నాయకులు లోకనాథం, జగ్గునాయుడు, కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పైల రమేష్‌రాజు, డి.రమణ, రామసంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గేట్ ర్యాంకర్లకు స్టైఫండ్

దాబాగార్డెన్స్ : గత రెండేళ్లుగా వైజాగ్‌లో గేట్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచెస్‌లో శిక్షణ అందిస్తూ ఉన్నత విద్యకు దోహదం చేయడమే కాక, గేట్ క్వాలిఫై అయిన ప్రతి ఒక్కరికీ రూ.12,400 నుంచి రూ.41 వేల వరకు స్టైఫండ్ అందిస్తున్నట్టు గేట్‌ప్రో వ్యవస్థాపకుడు సురేష్ వీఎస్ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలైన జాతీయ స్థాయి గేట్ పరీక్షా ఫలితాల్లో గేట్ ప్రో సంస్థ నుంచి పలువురు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. గేట్‌ప్రో నుంచి మనీష్ గుప్తా ఎలక్ట్రానిక్స్ విభాగంలో 46వ ర్యాంకు సాధించి ఐఐటీలో స్థానం సంపాదించాడని, బికాష్ షా 62వ ర్యాంకుతో సంస్థ ప్రతిష్ట పెంచారన్నారు. చాలా తక్కువ మందికి అవగాహన ఉండే ఈ పరీక్షకు కోచింగ్ ఇచ్చే సంస్థ గేట్ ప్రో గతంలో ఢిల్లీలో పదేళ్లు పనిచేసి, ఇక్కడ స్థాపించినట్లు తెలిపారు.

పక్షుల దాహార్తి తీరుద్దాం

సీఎంఆర్ సెంటర్‌లో వాటర్ బౌల్స్ పంపిణీ



సిమెంట్ వాటర్ బౌల్స్ అందిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మద్దిలపాలెం: పక్షులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, ఈ వేసవిలో వాటి దాహార్తి తీర్చేందుకు కృషి చేయాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ గీతానారాయణ్ సుదగాని పిలుపునిచ్చారు. గ్రీన్ సంస్థ, కేన్ ఫౌండేషన్ సంయుక్తంగా మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఆదివారం ఉచితంగా సిమెంట్ వాటర్ బౌల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మావూరి మాట్లాడుతూ జంతు సంరక్షణ కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గ్రీన్ సంస్థ వ్యవస్థాపకురాలు గీతానారాయణ సుదగాని మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో పక్షులకు నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత 12 ఏళ్లుగా నగరంలో ఉచితంగా సిమెంట్ వాటర్ బౌల్స్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. పక్షులు తిరిగే ప్రాంతాలలో ఈ గిన్నెలను పెట్టి రోజూ రెండు పూటలా నీటితో నింపాలని ఆమె సూచించారు. క్రమం తప్పకుండా రోజూ వాటిని శుభ్రం చేయాలన్నారు. ఇంటి పరిసరాలలో పక్షులకు అనుకూలమైన వాతావారణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కెన్ ఫౌండేషన్ ప్రతినిధి సంతోష్ మాట్లాడుతూ మరిన్ని ప్రాంతాలలో వాటర్ బౌల్స్ పంపిణీ చేయనున్నామన్నారు.

ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం లోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం-నా హక్కు' అన్న నినాదంతో 1948 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు మంచినీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, చక్కటి ఆహారం భుజించాలన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సయ్యద్ బేగం తదితరులు పాల్గొన్నారు.